క్లుప్తంగా

పరీక్ష ప్యాడ్‌లు అందజేత



పరీక్ష ప్యాడ్‌లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న 108 మంది విద్యార్థులకు 2001–2002 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కలర్ పెన్సిల్ బాక్స్‌లను అందజేశారు. వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉన్నత పాఠశాల టాపర్‌గా నిలిచే విద్యార్థికి తమ బ్యాచ్ తరఫున రూ.10వేల నగదు బహుమతి అందజేస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అంజయ్య, విఠల్, పూర్వ విద్యార్థులు విఠల్, నారాయణ, మొగులప్ప, జనార్దన్, శివప్రసాద్, హనుమాన్‌గౌడ్, రమేష్, హన్మంతరావు, నరేష్, గోపాల్, సాయిరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ప్రతి కార్యకర్తకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. కోహీర్ మండలంలోని సజ్జాపూర్ గ్రామానికి చెందిన పాండురంగారెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. ఆయనకు బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా పథకం ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబానికి క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు పార్టీ అధిష్టానం బీమా సౌకర్యం కల్పించిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, నాయకులు బండి మోహన్, గౌస్, శివప్ప, సర్పంచ్ విజయ్ పాల్గొన్నారు.

మొవ్వు తొలిచే పురుగును నియంత్రించాలి



జొన్నపంటను పరిశీలిస్తున్న ఏఓ శశాంక్, సిబ్బంది

కల్హేర్(నారాయణఖేడ్): మొవ్వు తొలిచే పురుగు ఆశించినట్లయితే ఆకులపై తెల్లని మచ్చలు ఏర్పడి మొక్క ఎదగకుండా పక్కన పిలకలను వేస్తుందని ఏఓ శశాంక్ తెలిపారు. సిర్గాపూర్ మండల పరిధిలోని సంగెం శివారులో సాగు చేస్తున్న జొన్న పంటను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సలహాలు, సూచనలు చేశారు. వాతావరణం బట్టి పంటను మొవ్వు తొలిచే పురుగు లేదా కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉందని వివరించారు. క్వీనాల్‌ఫాస్ రెండు మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కత్తెర పురుగు నివారణకు ఎమామెక్టిన్ బెంజెట్ 0.4 గ్రామ్ ఒక లీటర్‌తో పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు జ్ఞాన్‌దేవ్, బాబునాయక్, సంతోష్ పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోండి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక అధికారిణి జ్యోతి

నారాయణఖేడ్: విద్యార్థినులు సరైన జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జూకల్ శివారులోని కేజీబీవీ ప్రత్యేక అధికారిణి జ్యోతి సూచించారు. విద్యాలయం ఆవరణలో వాయిస్–4 స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వార్‌వాయిస్ శిబిరాల మొదటి దశలో భాగంగా శనివారం పరిచయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్ఞానం, నైపుణ్యాలతో అమ్మాయిలు తమ జీవితాలను, చుట్టూ ఉన్న వ్యక్తులను సైతం మార్చగలవన్నారు. శిబిరాల్లో యుక్త వయస్సు, రుతుక్రమ ఆరోగ్యం, ప్రాథమిక హక్కులు, హింస తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యతోనే సమాజంలో మార్పు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రతిఒక్కరికీ విద్యను అందించినప్పుడే సమాజంలో మార్పు వస్తుందని, విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అదేవిధంగా వాగ్దేవి జూనియర్, శివాజీ డిగ్రీ కళాశాలలో కళాశాల వార్షికోత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. ఆయా కళాశాలల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు నర్సింహారెడ్డి, శ్రీనివాస్, అధ్యాపకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్లు ఆనంద్‌స్వరూప్ షెట్కార్, దారం శంకర్, వివేకానంద్, అబ్దుల్ మజీద్, నాయకులు రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, వినోద్‌పాటిల్ పాల్గొన్నారు.

సంగ్రాం మహారాజ్‌ను సన్మానం

అయోధ్య బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరై వచ్చిన అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్, ఇరక్‌పల్లి ఆశ్రమ పీఠాధిపతి దేవదాస్ మహారాజ్‌లను ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి శాలువా, పూలమాలలతో సన్మానించారు. నాయకులు భోజిరెడ్డి, దారం శంకర్, రాంచందర్, రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సమాజాన్ని నిర్మిద్దాం

వివక్ష, అసమానతలు లేని నూతన సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్‌లో కేవీపీఎస్ 2024 క్యాలెండర్లను ఆ సంఘం నాయకులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివక్షలేని సమసమాజ స్థాపన కోసం మహనీయులు అంబేడ్కర్, పూలే కన్న కలలను నిజం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు, నాయకులు చిరంజీవి, మోషప్ప, రాజ్‌కుమార్, కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ షెట్కార్, దారం శంకర్, వివేకానంద్, రమేష్ చౌహాన్, వినోద్‌పాటిల్, పండరిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కల్హేర్(నారాయణఖేడ్): పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. కల్హేర్, సిర్గాపూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం పంపిణీ చేశారు. అనంతరం సిర్గాపూర్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎంపీపీ గుసుశీల, తహసీల్దార్ బాలశంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచయ్య, మాజీ ఎంపీపీ మల్లేశం, సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఆత్మ మాజీ చైర్మన్ నరేందర్, మాజీ కోఆప్షన్ సభ్యులు సర్దార్, సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ పీరప్ప, మాజీ సర్పంచ్ గోపాల్, నాయకులు మహేశ్వర్‌సేట్, వీర్‌షెట్టి, తుకరాం, జితేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, లతీఫ్, బాగ్‌వాన్ చందు, అనిల్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

మనూరు(నారాయణఖేడ్): మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో కల్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, రాథోడ్ మోతిబాయి, ఆర్డీఓ వెంకటేశం, డిప్యూటీ తహసీల్దార్ మగ్ని, నాయకులు డింగంబర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, బిరాదర్ దత్తు, సిద్దారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ విష్ణుసాగర్, డీటీ జుబేర్‌అహ్మద్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

పటాన్‌చెరు: గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి పనుల కోసం మంజూరైన పెండింగ్ నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పటాన్‌చెరు మండల పరిధిలోని కర్దనూరు గ్రామంలో మహిళా సమైక్య భవనాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచుల పదవీకాలం ముగుస్తున్న ప్రస్తుత తరుణంలో పెండింగ్ బిల్లులను సత్వరమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ , జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ నాగజ్యోతి, పంచాయతీరాజ్ డీఈ సురేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాండు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి గ్రామంలో మ్యాట్ కబడ్డీ కోచింగ్ సెంటర్‌ను అంతర్జాతీయ కబడ్డీ కోచ్, క్రీడాకారుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, ఉపసర్పంచ్ లింగారెడ్డి, వార్డుసభ్యులు అనంతరెడ్డి, శివ, నారాయణ, సర్దార్, ఎల్లయ్య, సురేష్, రవీందర్ పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

పటాన్‌చెరు టౌన్: వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునికతను జోడించి అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముత్తంగి గ్రామంలో రూ.60 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులు పండించిన పంటల నిలువ కోసం ఆధునిక గోదాములు నిర్మించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ ఉపేందర్, వైస్‌ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు భిక్షపతి, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, దశరథరెడ్డి, వెంకటరెడ్డి, పాలకవర్గం సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళా సమైక్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణాల కూల్చివేత



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని ఎల్గోయి గ్రామ శివారులో ప్రభుత్వ స్థలంలో ఇటీవల నిర్మించుకున్న రేకుల షెడ్లు, ఇళ్ల నిర్మాణాలను తెల్లవారుజామున టీఎస్ఐఐసీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు కూల్చివేశారు. తమకు ఎలాంటి సమాచారం అందించకుండా నిర్మాణాలు కూల్చివేయటంతో తమకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా కబ్జాలో ఉంటూ నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేయడం సరైనది కాదన్నారు. గతంలో కమ్యూనిటీ భవనాలు, లైబ్రరీతో పాటు పలు నిర్మాణాలకు స్థలం కేటాయించాలని అప్పటి మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లగా 15 ఎకరాల స్థలం సర్వే చేయించి కేటాయించాలని అధికారులకు ఆదేశించినట్లు గుర్తుచేశారు. ఎమ్మెల్యే వెంట సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, సర్పంచ్ ఓంప్రకాష్ పాటిల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం పాల్గొన్నారు.

గద్దర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం సరికాదు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లో ప్రజా గాయకుడు గద్దర్ విగ్రహ ఏర్పాటును హెచ్‌ఎండీఏ అధికారులు అడ్డుకోవడం సరికాదని తెల్లాపూర్ కౌన్సిలర్ భరత్ అన్నారు. గద్దర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడానికి నిరసిస్తూ శనివారం అమర నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ప్రజా గాయకుడు గద్దర్ మరణించిన తర్వాత 11వ రోజు తెల్లాపూర్‌లో భారీ ఎత్తున సంతాపసభ నిర్వహించినట్లు గుర్తు చేశారు. ఆ సభకు నేటి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పాల్గొన్నారని తెలిపారు. ఇదే సమయంలో ప్రతిపక్షంలో ఉన్నా ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే తెల్లాపూర్‌లో గద్దర్ స్మృతివనం నిర్మిద్దామని ఆ సభలో మాటిచ్చినట్లు గుర్తుచేశారు. కానీ.. హెచ్‌ఎండీఏ అధికారులు పట్టించుకోకుండా అడ్డుకోవడం విచారకరమన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తనపై, తన అనుచరుడు రవీందర్‌పై కేసు నమోదు చేశారని వాపోయారు. దీక్షకు బహుజన స్టూడెంట్ ఫ్రంట్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం, తెలంగాణ యూనివర్సిటీ బీఎస్‌ఎఫ్ విద్యార్థులు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థులు, సీనియర్ జర్నలిస్టులు తన అమర నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించి గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేవిధంగా అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

తమ్ముడిని చంపిన అన్న

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సొంత తమ్ముడిని అన్న గొడ్డలితో దారుణంగా హతమార్చిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపేట మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి ఆంజనేయులు(36), కుమ్మరి ప్రభాకర్ అన్నదమ్ములు. అయితే ఇద్దరి మధ్య కొంతకాలంగా భూ తగాదాలతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో విచక్షణ కోల్పోయిన ప్రభాకర్ తన సొంత తమ్ముడైన ఆంజనేయులు కళ్లలో కారం చల్లి విచక్షణారహితంగా గొడ్డలితో నరికి చంపి అడ్డుగా వచ్చిన తండ్రి చంద్రయ్యను తీవ్రంగా గాయపరిచాడు. సమాచారం తెలుసుకున్న సీఐ నవీన్‌కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. చంద్రయ్యను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ పొలం ధ్వంసం

జిన్నారం(పటాన్‌చెరు): ఓ రైతు నాటేసిన పొలాన్ని ధ్వంసం చేయడంతో పాటు, బోర్ డబ్బాను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చేసిన సంఘటన జిన్నారం మండలం జంగంపేట్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాధిత రైతు వీరారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాను వరిసాగుతో పాటు, బీరకాయ, సోరకాయ, టమాటా పంటలను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, తనకు న్యాయం చేయాలని వీరారెడ్డి కోరాడు.

◆ విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

మునిపల్లి(అందోల్): విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మల్లికార్జునపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల రాములు ఎప్పటిలాగే తన వ్యవసాయ పొలం దగ్గర ఎడ్లను మేపడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఎడ్లను మేపుతుండగా ఒక ఎద్దు మేస్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలింది. దీంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయకపోవడంతోనే తన ఎద్దు మృతి చెందిందని బాధిత రైతు వాపోయారు. అధికారులు స్పందించి నష్ట పరిహారం మంజూరు చేయాలని కోరారు.

◆ కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐడీఈఎఫ్ గెలుపు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఏద్దుమైలారంలో ఉన్న ఆయుధ కార్మాగారం(ఓడీయఫ్)లో జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఏఐడీఈఎఫ్ ఘన విజయం సాధించింది. ఈ నెల 23న ఎన్నిక నిర్వహించగా శనివారం లేబర్ వెల్ఫేర్ కార్యాలయంలో ఓట్ల లెక్కింపు నిర్వహించి ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. ఓటింగ్‌లో1486మంది పాల్గొనగా వీటిలో 3ఓట్లు చెల్లలేదు. ఏఐడీఈఎఫ్‌కు 574, బీఎంఎస్‌కు 392, ఐఎన్ టీయూసీకు 380, ఓఎఫ్‌ఆర్‌ఈయూకు 112 ఓట్లు వచ్చాయి. దీంతో ఏఐడీఇఎఫ్ విజయం సాధించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఈశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్మికులు సంబరాలు జరుపుకున్నారు.

◆ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

మునిపల్లి(అందోల్): ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు ఏఎస్ఐ ఏసయ్య ఎల్‌ఎన్‌టీ సంస్థ ఆధ్వర్యంలో బుదేరా శివారులోని జాతీయ రహదారిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్లంటి సిబ్బంది, పోలీస్ సిబ్బంది ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేస్తాం

జిన్నారం(పటాన్‌చెరు): ముఖ్యమంత్రి నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రణాళికను సిద్ధం చేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని అండూర్, రాళ్లకత్వ, ఊట్ల, మంగంపేట గ్రామాల్లో శనివారం పర్యటించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ, ఎంపీటీసీ జనాబాయి, నాయకులు పాల్గొన్నారు.

◆ కుట్టు మిషన్‌ల పంపిణీ

జహీరాబాద్ టౌన్: కార్మిక కుటుంబాలకు న్యాక్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు మిషన్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్మికశాఖ జిల్లా కమిషనర్ రవీందర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జాన్, జిల్లా అధికారి యాదయ్య, ఆర్‌అండ్‌బీ డీఈఈ నర్సింలు, న్యాక్ డైరక్టర్ రమేష్, అసిస్టెంట్ కార్మికశాఖ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ కార్మిక కుటుంబాలను ఆదుకునేందుకు కుట్టు మిషన్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలో డ్రైనేజీ, రోడ్డు సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని కార్పొరేటర్ సింధురెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఆమె వెంట నాయకులు ఆదర్శ్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు వెంకట్రావు, కార్యదర్శి సుబ్బారావు, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు భాస్కర్, సంపత్ పాల్గొన్నారు.

◆ శ్రీసాయినగర్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బస్తీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ పుష్ప డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు తన దృష్టికి తీసుకునివచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

◆ క్రీడల్లో రాణించాలి

సంగారెడ్డి టౌన్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. సంగారెడ్డి మండల పరిధిలోని కులబ్ గూర్ గ్రామ శివారులోని సరస్వతి శిశు మందిర్ విద్యాపీఠంలోని సంగారెడ్డి విభాగస్థాయి కేల్ కూద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్నం మాణిక్యం ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. పాఠశాల అధ్యక్షుడు కిష్టయ్య, సెక్రెటరీ అంజయ్య, యువజన సంఘాల నాయకులు వేణుగోపాల్, దశరథ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌కు చెందిన మేడిగె అంజయ్య (60) అదృశ్యంపై అతని సోదరుడు శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24న జిల్లా కేంద్రం సంగారెడ్డిలో పని ఉందని చెప్పి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు అంజయ్య ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే 87126 56770కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

◆ ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కంది(సంగారెడ్డి): నిరుద్యోగ యువకులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాధిక సూచించారు. మండల పరిధిలోని జుల్కల్‌లో ఉపాధి అవకాశాలపై నిరుద్యోగ యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకున్న ప్రతిఒక్కరూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జలజా, సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు పరిశీలన

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ కాలనీ, ఎంజీ రోడ్డు ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.

◆ రోడ్డు విస్తరణపై సర్వే

నారాయణఖేడ్: నిజాంపేట్–నారాయణఖేడ్–బీదర్ 161బీ జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూములపై అధికారులు శనివారం సర్వే నిర్వహించారు. నేషనల్ హైవే ఎఈఈ శ్రీకాంత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ నర్సింహులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యాంరావు, వీఆర్ఏ శంకర్‌లు నారాయణఖేడ్ మండలంలోని జూకల్ శివారులో సర్వే నెంబరు 23, 24, 28, 29ల్లో సర్వే చేపట్టారు. అంతకుముందు బాణాపూర్ శివారులో సర్వే చేపట్టారు. పక్షం రోజుల్లో ఎన్‌హెచ్ 161బీ రోడ్డు సర్వే పూర్తవుతుందని ఏఈఈ శ్రీకాంత్ తెలిపారు.

◆ బోరంచ నల్లపోచమ్మ ఆలయ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

మనూరు(నారాయణఖేడ్): జిల్లాలో ప్రసిద్ధి చెందిన బోరంచ నల్లపోచమ్మ ఆలయ నూతన కమిటీకి 2024 సంవత్సరానికి సంబంధించి దేవదాయ, ధర్మాదాయ శాఖ శనివారం నోటిఫికేషన్‌ను జారీ చేసినట్లు ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు నోటిఫికేషన్ జారీ నాటి నుంచి 20 రోజుల్లోపు దరఖాస్తు ఫారంతో హైదరాబాద్‌లోని ఎండోమెంట్ కార్యాలయంలో అందించాలని సూచించారు.

◆ వివేకానంద సేవా సమితి మండల కమిటీ ఎన్నిక

న్యాల్‌కల్(జహీరాబాద్): వివేకానంద సేవా సమితి మండల కమిటీని శనివారం వివేకానంద సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆనందేశ్వర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా లవేష్ పాటిల్, ఉపాధ్యక్షుడిగా మహేష్, ప్రధాన కార్యదర్శిగా రుద్రప్ప, కార్యదర్శిగా మంజునాథ్, సభ్యులుగా వినోద్, రమేష్, ప్రశాంత్, మల్లికార్జున్ ఎన్నికయ్యారు.

◆ విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉస్మాన్‌నగర్‌లోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం పలు కాలనీలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఉస్మాన్‌నగర్, బీహెచ్ఈఎల్ మ్యాక్స్ సొసైటీ, రాజ్ పుష్ప, అలియాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

◆ క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని హోప్ హస్పిటల్‌లో డాక్టర్ కృష్ణమూర్తి, హోప్ డైరెక్టర్ శంకర్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మాణిక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి, హోప్ హస్పిటల్ డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సంఘ సంస్కర్తలు పూలే వంటి ఎందరో మహనీయులు తమ జీవితాన్ని సమాజం కోసం అంకితం చేశారన్నారు. అందరికీ సమానమైన విద్య, వైద్యం అందాలని తెలిపారు. అంబేడ్కర్ స్ఫూర్తితో పే బ్యాక్ సొసైటీకి తమ వంతు కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధి పనులకు ఆమోదం

పుల్కల్(అందోల్): 2024–25 సంవత్సరానికి సంబంధించి చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై ప్రణాళికలు రూపొందించామని ఎంపీడీఓ జయలక్ష్మి అన్నారు. ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఏడాది వరకు ఆయా గ్రామాల్లో చేపట్టనున్న పనులపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. బీపీడీపీ పథకంలో భాగంగా చేపట్టే ఈ పనులకు ప్రజాప్రతినిధులు ఆమోదం తెలిపారని ఆమె పేర్కొన్నారు.

◆ అధిక సాంద్రత పద్ధతిలో లాభాలు



హత్నూర(సంగారెడ్డి): పత్తి పంటలో అధిక సాంద్రత పద్ధతిలో లాభాలు వస్తాయని ఏరువాక కేంద్రం జోగిపేట శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, సరిత అన్నారు. మండలంలోని బోరుపట్ల గ్రామ శివారులో జైకిసాన్ ఆధ్వర్యంలో పత్తి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఓ శ్రీనివాస్, జైకిసాన్ ప్రతినిధులు నారాయణ పాల్గొన్నారు.

◆ మట్కా జూదరుల అరెస్టు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రంజోల్, టౌన్‌లో మట్కా జూదం ఆడుతున్న ఆరుగురిని విశ్వసనీయ సమాచారంతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం అరెస్టు చేసింది. అరెస్టయినవారిలో కృష్ణ, కంటి రవి, కంటి రాజు, చిలకపల్లి చంద్రయ్య ఉన్నారు. అదేవిధంగా పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో దాడులు చేసి బోయిని నర్సింహులు, కురేషి యాదుల్‌ను అదుపులోనికి తీసుకొని వారి వద్ద రూ.1,43,500లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జహీరాబాద్ టౌన్, రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జహీరాబాద్ టౌన్ సీఐ రాజు హెచ్చరించారు.

◆ షబ్బీర్ అలీని కలిసిన నాయకులు

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలకు సలహాదారుడిగా షబ్బీర్ అలీ నియామకమైన సందర్భంగా మండలంలోని దౌల్తాబాద్ గ్రామానికి చెందిన టీపీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీమ్, యువజన కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు రియాజ్ అలీ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.